సాక్షి
ఖమ్మం
బుధవారం । 3 । మే । 2023



ఎందుకీ వివక్ష?

సింగరేణి పరిధి కళాశాలలు, పాఠశాలల్లో కాంట్రాక్టు ఉద్యోగులకు వేతనాల చెల్లింపులో వ్యత్యాసం కొనసాగుతోంది. 8లో



'పట్టు'కుంటే లాభాలే..!

మల్బరీ సాగు, పట్టు పరిశ్రమల స్థాపనకు మరింత మంది రైతులు ముందుకొచ్చేలా ప్రభుత్వం రాయితీలు ప్రకటించింది. 10లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం
34° / 24°

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కేసుల సత్వర పరిష్కారానికి కృషి

జిల్లా జడ్జి జగ్జీవన్‌కుమార్



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జగ్జీవన్ కుమార్

ఖమ్మంలీగల్: కేసుల సత్వర పరిష్కారంతో పాటు అందరి సహకారంతో జిల్లాలో పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించేందుకు కృషిచేస్తానని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీ.ఎస్.జగ్జీవన్ కుమార్ తెలిపారు. ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు ఆధ్వర్యాన జిల్లా ప్రధాన న్యాయమూర్తి జగ్జీవన్‌కుమార్, అదనపు జిల్లా జడ్జి కె.ఉమాదేవి పరిచయ కార్యక్రమాన్ని మంగళవారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని తెలిపారు. జిల్లా అదనపు న్యాయమూర్తి ఉమాదేవి మాట్లాడుతూ గతంలో తనకు ఖమ్మంలో పనిచేసిన అనుభవం ఉందని, అందరి సహకారంతో ముందుకెళ్తానని తెలిపారు. న్యాయమూర్తులు మహ్మద్ జావీద్ పాషా, అమరావతి, ఆషారాణి, బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణతో పాటు న్యాయ వాదులు లక్ష్మీనారాయణ, బసవయ్య, ప్రవీణ్, అమర్‌నాథ్, గుప్తా, లక్ష్మి, సింగం జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 1న ఆన్‌లైన్‌లో పరీక్ష



ఖమ్మం సహకారనగర్: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో 2023–25 విద్యా సంవత్సరం ప్రవేశాలు కల్పించేందుకు వచ్చే నెల 1న ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నారు. ఈవిషయాన్ని డీఈఓ సోమశేఖరశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పూర్తి వివరాల కోసంhttp://deecet.cdse.telangana.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

45 వైద్యాధికారుల పోస్టులకు దరఖాస్తులు

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలోని పల్లె దవాఖానాల్లో 45 వైద్యాధికారుల పోస్టులు భర్తీ చేయనున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ బి.మాలతి తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేసే ఈ పోస్టులకు ఎంబీబీఎస్ పూర్తి చేసి తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్టర్ చేసుకున్న వారు అర్హులని పేర్కొన్నారు. కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న కమిటీ ద్వారా నియామకాలు ఉంటాయని, ఆసక్తి ఉన్న వారు బయోడేటా, సర్టిఫికెట్లతో ఈనెల 5వ తేదీలోగా తమ కార్యాలయంలో నేరుగా కానీ, జిల్లా వెబ్‌సైట్ ద్వారా కానీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జలవనరుల శాఖలో ఈఈల బదిలీ

ఖమ్మంఅర్బన్: జలవనరుల శాఖలో ముగ్గురు ఈఈలను మంగళవారం బదిలీ చేసినట్లు తెలిసింది. ఖమ్మం జిల్లాలోని వైరా డివిజన్ ఈఈ శ్రీనివాసచార్యులును భద్రాది కొత్తగూడెం జిల్లా ఇల్లెందు ఈఈగా బదిలీ చేయగా, అక్కడ పనిచేస్తున్న మహేశ్వరరావును ములుగు డిప్యూటీ సీఈగా నియమించినట్లు సమాచారం. అలాగే, ములుగులో డిప్యూటీ సీఈగా ఉన్న కె.బాబురావును వైరా ఈఈగా నియమించినట్లు తెలిసింది. అయితే, వైరా ఈఈ శ్రీనివాసచార్యులు బదిలీని ఆ ప్రాంత రైతులు వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం.

నేడు ఎమ్మెల్సీతో ముఖాముఖి

ఖమ్మం సహకారనగర్/మధిర/ఎర్రుపాలెం: అన్ని యజమాన్యాల పరిధిలోని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకుల నుంచి విద్యారంగ సమస్యలు తెలుసుకునేందుకు బుధవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి నేతృత్వాన ముఖాముఖి ఏర్పాటుచేశారు. ఖమ్మంలోని జెడ్పీ సమావేశ మందిరంలో సాయంత్రం నాలుగు గంటలకు ముఖాముఖి ప్రారంభమవుతుందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈమేరకు ఉపాధ్యాయులు, గురుకులాల ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, కేజీబీవీ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అలాగే, మధిరలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30గంటలకు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డితో ముఖాముఖి ఉంటుందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్ వలీ, ఎర్రుపాలెం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండారు నాగరాజు, అనుమోలు కోటేశ్వరరావు వేర్వేరు ప్రకటనల్లో వెల్లడించారు.

పట్టాలెక్కుతున్న ఆనందం!

- జీఓ 58 ద్వారా నివాసస్థలంపై హక్కు
- జిల్లా అధికారుల వద్ద 13,517 దరఖాస్తులు
- మరో నెల రోజులు గడువు పెంచిన ప్రభుత్వం
- ఇప్పటివరకు 2,720 మందికి పట్టాల పంపిణీ



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఏర్పరచుకున్న వారికి 58 జీఓ ఆధారంగా పట్టాలు జారీ చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియ జిల్లాలో వేగంగా సాగుతోంది. పొడిగించిన కటాఫ్ తేదీ ప్రకారం దరఖాస్తు గడువు గతనెల 30వ తేదీతో ముగిసినా, పేదలకు మరింత అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మరో నెల పాటు పొడిగించింది. ప్రస్తుతం జిల్లాలో అధికారుల వద్ద 13,517 దరఖాస్తులు ఉండగా, వీటి పరిశీలనతో పాటు పట్టాల పంపిణీ కొనసాగుతోంది.

యాజమాన్య హక్కు కోసం జీఓలు

సుదీర్ఘ కాలంగా ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో ఇళ్లు నిర్మించుకుని ఉంటున్న వారికి యాజమాన్య హక్కు కల్పించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఇందు కోసం జీఓలు 58, 59 విడుదల చేసింది. ఇందులో 58 జీఓ ద్వారా 125 చదరపు గజాల లోపు స్థలమైతే ఉచితంగా, జీఓ 59 ద్వారా 125 చదరపు గజాలు దాటిన స్థలానికి మార్కెట్ ధర ఆధారంగా నగదు చెల్లిస్తే క్రమబద్ధీకరిస్తారు. ఈమేరకు అందిన దరఖాస్తులను యాప్‌లో నమోదు చేశారు. ఆ తర్వాత ప్రభుత్వం నిర్ణయాన్ని వెలువరించకపోగా, ఈ ఏడాది ఫిబ్రవరి 13న మంత్రివర్గ ఉపసంఘం సమావేశమై క్రమబద్ధీకరణ పూర్తిచేయాలని ఆదేశించింది. దీంతో జిల్లాలో అధికారులు దరఖాస్తుల పరిశీలన చేపట్టారు.

కటాఫ్ తేదీ పెంపుతో అవకాశం

తొలుత 2014 జూన్ 2లోగా నివాసం ఏర్పర్చుకున్న వారి స్థలాలనే క్రమబద్ధీకరిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీని ప్రకారం అర్హులైన వారిని గుర్తించి క్రమబద్ధీకరణ చేపట్టారు. ఆతర్వాత పేదలకు ఇబ్బంది కలగొద్దని కటాఫ్ తేదీని 2020 జూన్ 2గా ప్రకటించడంతో ఆ తేదీలోగా ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న వారు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఏర్పడింది. ఇందు కోసం ఏప్రిల్ 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు.

దరఖాస్తులకు మరో నెల

స్థలాల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకునే గడువు ఏప్రిల్ 30నే ముగియగా సోమవారం కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అధికారులతో సమీక్షించి దరఖాస్తుల పరిశీలనపై సూచనలు చేశారు. ఇంతలోనే జీఓ 58 కింద దరఖాస్తు చేసుకునే గడువును మరో నెల పాటు పెంచుతున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు. దీంతో మరికొందరికి స్థల క్రమబద్ధీకరణ అవకాశం దక్కనుంది.

దరఖాస్తుల ప్రక్రియ ఇలా...

ఆమోదించినవి	3,253
పట్టాలు ఇచ్చినవి	2,720
తిరస్కరించినవి	5,346
పరిశీలించాల్సిన దరఖాస్తులు	13,517

చకచకా ప్రక్రియ

క్రమబద్ధీకరణ కోసం వచ్చిన దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన జరుగుతోంది. గతంలోనే కలెక్టర్ గౌతమ్ చొరవతో ప్రత్యేక బృందాలతో సర్వే చేపట్టారు. కటాఫ్ తేదీ మార్పు తర్వాత అర్హులుగా ఉన్న వారిని గుర్తించి వారు దరఖాస్తు చేసుకునేలా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గడువు కూడా పెంచిన నేపథ్యాన అర్హులైన వారు దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు ఏర్పడింది. జిల్లాలో ఇప్పటి వరకు 3,253 దరఖాస్తులను ఆమోదించగా, ఇందులో 2,720 మందికి పట్టాల పంపిణీ కూడా పూర్తయింది. ఇంకా 13,517 దరఖాస్తులు ప్రస్తుతం పరిశీలనలో ఉండగా.. ప్రభుత్వం గడువు పెంచడంతో వీటి సంఖ్య మరింత పెరుగుతుందనే భావనతో పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిశీలించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.



సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే వెంకటవీరయ్య చిత్రపటాలతో సత్తుపల్లి మున్సిపల్ సిబ్బంది

సఫాయిలారా సలాం!

- పారిశుద్ధ్య కార్మికులకు పెరిగిన వేతనం
- మే డే కానుకగా ప్రకటించిన ప్రభుత్వం
- మున్సిపాలిటీలు, జీపీల్లో వర్కర్ల వేతనం రూ.వెయ్యి పెంపు
- హర్షం వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం సహకారనగర్: ఊరు నిద్ర లేవకముందే వారు మేల్కొంటారు.. అంతా నిద్ర లేచి వీధుల్లోకి వచ్చేసరికి శుభ్రంగా తీర్చిదిద్దుతారు. అందరూ డ్రెయినేజీల పక్క నుంచి వెళ్తూ దుర్వాసన భరించలేక ముక్కు మూసుకుంటే వీరు మాత్రం అందులోకి దిగి మరీ శుభ్రం చేస్తారు.. వీరే పారిశుద్ధ్య కార్మికులు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాల నిర్వహణ, అవార్డులు సాధించడంలో కీలకపాత్ర పోషిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వం మే డే కానుక ప్రకటించింది. వీరి వేతనాలను వెయ్యి చొప్పున పెంచుతున్నట్లు ప్రకటించిన సీఎం కేసీఆర్ నిర్ణయం సత్వరమే అమల్లోకి వస్తుందని వెల్లడించారు. దీంతో పనికి సరిపడా వేతనం అందడం లేదని ఆవేదన చెందుతున్న పారిశుద్ధ్య కార్మికులకు ప్రస్తుత పెంపు కొంత ఊరటనిస్తుందనే చెప్పాలి.

3,508 మందికి లబ్ధి

జిల్లాలోని ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు సత్తుపల్లి, వైరా, మధిర మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 1,214 మంది కార్మికులు పారిశుద్ధ్య విభాగంలో పని చేస్తున్నారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 958 మంది, సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో 117, వైరా మున్సిపాలిటీ పరిధిలో 59, మధిర మున్సిపాలిటీ పరిధిలో 80 మంది ఉన్నారు. వీరేకాక మరికొందరు తాత్కాలిక విధానంలో పనిచేస్తున్నారు. ఇందులో సెమీస్కిల్డ్ వర్కర్లకు రూ.15,500, స్కిల్డ్ వర్కర్లకు రూ.19,500 వేతనం అందుతుండగా, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వేతనం రూ.16,500, రూ.20,500కు చేరనుంది. ఇక జిల్లాలోని 20మండలాల్లో 589 గ్రామపంచాయతీలకు గాను 2,294మంది కార్మికులు(మల్టీ పర్పస్ వర్కర్లు) విధులు నిర్వర్తిస్తున్నారు. చిన్న జీపీల్లో రూ.8,500, మేజర్ జీపీల్లో రూ.10,500 వేతనం అందుతుండగా వీరికి కూడా రూ.వెయ్యి చొప్పున వేతనం పెరగనుంది.

తెలంగాణ ఏర్పడ్డాకే గౌరవం



తెలంగాణ ఏర్పడిన సమయంలో పారిశుద్ధ్య కార్మికుల వేతనం రూ.8వేలుగా ఉంది. ఆతర్వాత తెలంగాణ ప్రభుత్వం కార్మికుల వేతనాలను రూ.15,500కు పెంచింది. సీఎం కేసీఆర్ మళ్లీ ఇప్పుడు రూ.వెయ్యి పెంచడంతో కార్మికులకు స్వరాష్ట్రంలో గౌరవం దక్కినట్లయింది.

– పునుకొల్లు నీరజ, మేయర్, కేఎంసీ

ప్రభుత్వ నిర్ణయం ఊరటనిచ్చింది..



మా వేతనాలు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఊరటనిచ్చింది. పెరిగిన ఖర్చులతో చూస్తే ఇప్పుడు వచ్చే వేతనం ఎటూ సరిపడడం లేదు. అయినా ఇతర ఉపాధి లేక కష్టాలను భరిస్తూనే పనిచేస్తున్నాం. ఇప్పుడు పెరిగిన వేతనం మాపై కొంత భారాన్ని తగ్గిస్తుంది.

– సంధ్య, పారిశుద్ధ్య కార్మికురాలు, కేఎంసీ

వేతన పెంపు హర్షణీయం



ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు పెంచడం హర్షణీయం. ఇది చాలా సంతోషకరమైన విషయం అరకొర వేతనాలతో పనులు చేస్తున్న మాకు వేతనం పెంచడం ద్వారా కొంత ఆసరాగా ఉంటుంది. మా ఇబ్బందులను గమనించి వేతనాలు పెంచిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు.

– తుంగ రఘు, పారిశుద్ధ్య కార్మికుడు, కేఎంసీ

ఆనందంగా ఉంది..



ఒక్కో కార్మికుడికి వేతనం రూ.వెయ్యి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటం ఆనందంగా ఉంది. మా కష్టాన్ని గుర్తించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు. కొన్నాళ్లుగా వేతనం పెంచాలని కోరుతూ ఆందోళనలు సైతం నిర్వహించాం. వేతనం పెంపు కొంత ఉపశమనం కలిగిస్తుంది.

–ముత్యాల కిరణ్, తీగలబంజర, కొణిజర్ల మండలం

మరింత ఉత్సాహంలో విధులు



రాష్ట్రప్రభుత్వం పంచాయతీ కార్మికులకు వేతనాన్ని రూ.వెయ్యి పెంచుతూ నిర్ణయించడం హర్షణీయం. క్షేత్రస్థాయిలో కీలకంగా పనిచేస్తున్న మమ్మల్ని గుర్తించి వేతనాన్ని పెంచిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు. మరింత ఉత్సాహంతో పనిచేయడానికి వీలవుతుంది. – పేరపొంగు శేఖర్, చింతగుర్తి, రఘునాథపాలెం మండలం

పారిశుద్ధ్యం లోపిస్తే కఠిన చర్యలు

- కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి
- ఇద్దరు జవాన్లకు రూ.2వేల చొప్పున జరిమానా



రోడ్ల వెంట వ్యర్థాలపై ప్రశ్నిస్తున్న కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం అర్బన్: నగరంలోని ప్రతీ వీధి పరిశుభ్రంగా ఉండాలని.. రోడ్ల వెంట వ్యర్థాలు కనిపించినా, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకున్నా సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి హెచ్చరించారు. ఖమ్మంలోని 32, 25, 39, 36 డివిజన్లలో పారిశుద్ధ్య నిర్వహణను అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తాతో కలిసి ఆయన తనిఖీ చేశారు. రోడ్ల వెంట వ్యర్థాలు వేస్తుండడం, వాటిని ఎప్పటికప్పుడు తొలగించడం లేదని గుర్తించిన కమిషనర్ జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లను మందలించారు. ఈమేరకు 32వ డివిజన్ జవాన్‌కు రూ.2 వేలు జరిమానా విధించాలని, అవసరమైతే పారిశుద్ధ్య విభాగంలోకి మార్చాలని అధికారులను ఆదేశించారు. ఇక 36వ డివిజన్‌లో తడి, పొడిచెత్త వేర్వేరుగా సేకరించకపోవడంతో జవాన్‌కు రూ.2 వేల జరిమానా విధించాలని అసిస్టెంట్ కమిషనర్‌కు సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ప్రతిరోజు డివిజన్లలో పర్యటించాలని సూచించారు. అనంతరం కేఎంసీలోని సమావేశ మందిరంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమావేశమైన కమిషనర్ ఆదర్శ్ సురభి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ బి.మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు. ఆతర్వాత రఘునాథపాలెం మండలం మంచుకొండలోని ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళా పరీక్షల తీరును కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా పరిశీలించి వైద్యసేవలపై ఆరా తీశారు. ఈకార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ కె.సంధ్యారాణి, ఎంపీడీఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరుకు మిగులు పనులు పూర్తి



అధికారులతో సమీక్షిస్తున్న సీఈ శంకర్‌నాయక్

ఖమ్మంఅర్బన్: జిల్లాలో వివిధ పథకాల్లో కొనసాగుతున్న పనులన్నింటినీ ఈనెలాఖరు నాటికి పూర్తి చేయించాలని జలవనరులశాఖ సీఈ శంకర్‌నాయక్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో మంగళవారం ఆయన శాఖ ఇంజనీర్లతో పలు అంశాలపై సమీక్షించారు. జిల్లాలో వివిధ దశల్లో ఉన్న మిషన్ కాకతీయ చెరువుల అభివృద్ధి, చెక్‌డ్యాంలు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, త్రిపుల్ ఆర్ పథకాలు, సీతారామ ప్రాజెక్ట్ తదితర పనులపై డివిజన్ల వారీగా సమీక్షించి సూచనలు చేశారు. ఇంకా ఏమైనా మరమ్మతు పనులు చేయాల్సి ఉంటే ఈనెల 10లోపు ప్రతిపాదనలు ఇవ్వాలని తెలిపారు. ఖమ్మం, కల్లూరు ఎస్ఈలు నర్సింగరావు, ఆనందబాబు, డీసీ ఈ ధన్‌కుమార్ రెడ్డి, ఈఈలు ఎం.వెంకటేశ్వర్లు, శ్రీనివాసాచార్యులు, రామకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, అనన్య ఉన్నారు.

విద్యుత్ భద్రతా వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ



వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్ఈ సురేందర్, అధికారులు

ఖమ్మంవ్యవసాయం: ఎన్పీడీసీఎల్ పరిధిలో ఈనెల 7వ తేదీ వరకు కొనసాగనున్న విద్యుత్ భద్రతా వారోత్సవాల పోస్టర్లు, కరపత్రాలతో పాటు భద్రతపై అవగాహన కల్పించేలా రూపొందించిన పుస్తకాలను అధికారులు ఖమ్మంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఖమ్మం విద్యుత్ సర్కిల్ ఆపరేషన్స్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఏ.సురేందర్ మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులకు భద్రతపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రమాదాల నివారణపై అవగాహన కోసం సమావేశాలు ఏర్పాటుచేస్తామని చెప్పారు. కాగా, విద్యుత్ సంబంధిత సమస్యలు తలెత్తినప్పుడు టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 0028, హెల్ప్‌లైన్ నంబర్ 1912కు ఫోన్ లేదా మెసేజ్ ద్వారా తెలియచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈలు వీసీహెచ్.బాబూరావు, ఎన్.రామారావు, సీహెచ్.నాగేశ్వరరావు, ఏడీఈలు సీహెచ్.సుధాకర్‌రావు, ఎన్.సతీష్ పాల్గొన్నారు.

'ఆరోగ్య మహిళ'ను పరిశీలించిన అదనపు కలెక్టర్

ఖమ్మంవైద్యవిభాగం/వైరా: ఖమ్మం జనరల్ ఆస్పత్రిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంతో పాటు వైరా పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళ పరీక్షలను మంగళవారం అదనపు కలెక్టర్ స్నేహలత తనిఖీ చేశారు. ప్రతీ మంగళవారం ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా పరీక్షలు చేస్తుండగా ఆమె పరిశీలించి వైద్య సేవలను తెలుసుకున్నారు. అలాగే, పరీక్షల వివరాలు, చికిత్సపై ఆరా తీశారు. అనంతరం జిల్లా జనరల్ ఆస్పత్రిలోని రేడియాలజీ విభాగాన్ని కూడా అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు, ఆర్ఎంఓలు బి.శ్రీనివాసరావు, అమర్‌సింగ్, డీఎంహెచ్ఓ బి.మాలతి, జిల్లా సంక్షేమాధికారి సంధ్యారాణి, సీడీపీఓ శారద శాంతి, వైద్యులు, ఉద్యోగులు ఉదయలక్ష్మి, దేవీశ్రీ, జ్యోత్స్న, మాలతి, సరిత పాల్గొన్నారు.



ఆస్పత్రి అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ స్నేహలత



ఎన్నెన్నో వర్ణాలు !

వాతావరణంలో రెండు, మూడు రోజులుగా మార్పులు కనిపిస్తున్నాయి. ఓపక్క వర్షం కురుస్తూ వాతావరణం చల్లబడగా.. అక్కడక్కడా ఎండ నమోదవుతోంది. ఇదేక్రమాన వైరా రిజర్వాయర్ వద్ద మంగళవారం సాయంత్రం ఓవైపు చిరు జల్లులు పడుతుండగా ఆకాశం కొత్త అందాలు సంతరించుంది. సూర్యాస్తమయ సమయాన నిమిషాల వ్యవధిలో వర్ణాలు మార్చుకుంటున్న ఆకాశాన్ని రిజర్వాయర్ సమీపాన వాకింగ్ చేస్తున్న వారు, స్థానికులు ఆశ్చర్యంగా తిలకించారు. – వైరా

క్లుప్తంగా

నేడు మాజీ ఎంపీ పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్, ఖమ్మం, చింతకాని, కొణిజర్ల, వైరా మండలాల్లోని పలు గ్రామాల్లో జరిగే కార్యక్రమాలకు ఆయన హాజరవుతారని క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

జాతీయ నెట్‌బాల్ క్రీడాకారులకు అభినందన


క్రీడాకారులతో గుండాల కృష్ణ, తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: ఇటీవల ఢిల్లీలో జరిగిన జాతీయ నెట్‌బాల్ పోటీల్లో రాణించిన క్రీడాకారులను ఆర్జేసీ విద్యాసంస్థల చైర్మన్ జి.కృష్ణ మంగళవారం అభినందించారు. జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలు గత నెల 25నుంచి 28వ తేదీ వరకు జరగగా, రాష్ట్ర బాలికల జట్టు మొదటిస్థానంలో, బాలుర జట్టు రెండోస్థానంలో నిలిచింది. బాలికల జట్టులో జిల్లా నలుగురు, బాలుర జట్టులో ముగ్గురు క్రీడాకారులు పాల్గొని సత్తా చాటారు. ఈ సందర్భంగా వారిని కృష్ణతో పాటు నెట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు దీపిక, ఫణి అభినందించారు.

ఖమ్మం సిటీ బస్టాండ్‌లో ఆర్‌ఎం తనిఖీ


బస్టాండ్‌లో పరిశీలిస్తున్న ఆర్‌ఎం, డీఎం

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం సిటీ బస్టాండ్‌ను మంగళవారం ఆర్‌ఎం ఎస్తేర్ ప్రభులత తనిఖీ చేశారు. డీఎం శ్రీనివాస్‌తో కలిసి బస్టాండ్ కలియదిరిగిన ఆమె ప్రయాణికులతో మాట్లాడి బస్సుల రాకపోకలు, సౌకర్యాలపై ఆరా తీశారు. అలాగే, బస్టాండ్‌లో దుకాణాల సముదాయం అద్దెకు ఇచ్చేందుకు టెండర్లు పిలవాలని డీఎంకు సూచించారు. ఖమ్మం సీఐ రామయ్యతో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన పదో తరగతి, ఇంటర్‌మీడియట్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. పదో తరగతి ఉదయం పరీక్షకు 692 మందిలో 599మంది హాజరుకాగా, మధ్యాహ్నం పరీక్షకు ఒకరికి ఒకరు గైర్హాజరయ్యారు. అలాగే, ఉదయం జరిగిన ఇంటర్ పరీక్షకు 328మందిలో 258మంది హాజరయ్యారని డీఈఓ సోమశేఖర శర్మ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ పాపారావు తెలిపారు. కాగా, నగరంలోని హౌంట్‌ఫోర్‌స్కూల్ పరీక్ష కేంద్రాన్ని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు.

తడిసిన పంటలు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో అకాల వర్షాల కారణంగా తడిసిన వరి, మొక్కజొన్నలను ప్రభుత్వమే కొనుగోలు చేయడమే కాక నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు బాగం హేమంతరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిన నేపథ్యాన మద్దతు ధరతో కొనుగోలు చేయాలని కోరారు. అలాగే, మొక్కజొన్న కొనుగోళ్లకు మార్క్‌ఫెడ్ కేంద్రాలు ఏర్పాటుచేయాలని, గతంలో ప్రకటించిన పరిహారం వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

కేసు భయంతో ఆత్మహత్యాయత్నం?

చింతకాని: మండలంలోని వందనం గ్రామానికి చెందిన కాంసాని శ్రీను మంగళవారం ఎలుకల మందు తాగి మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఓ వ్యక్తి కారణంగా తన భర్తపై కొణిజర్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని, అందుకే భయపడి ఆత్మహత్యకు యత్నించాడని ఆయన భార్య కావ్య వెల్లడించింది. ప్రస్తుతం శ్రీను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	1,700	1,400
పెసలు	7,000	3,000
అలసంద	6,525	6,500
మిర్చి	22,000	12,500
తాలు మిర్చి	10,000	8,000
పత్తి	7,475	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.14,205

ఎందుకీ వివక్ష?



విద్యారంగంలో సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ

- ఆరు జిల్లాల పరిధిలో స్కూళ్లు, కాలేజీల నిర్వహణ
- 'సొసైటీ'లో భారీగా కాంట్రాక్ట్ సిబ్బంది నియామకం
- పాఠశాల, కళాశాలల సిబ్బందికి వేతనాల చెల్లింపులో వ్యత్యాసం



సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: దక్షిణ భారతదేశంలో ఏకైక బొగ్గు ఉత్పత్తి సంస్థగా ఉన్న సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కార్మికుల సంక్షేమం విషయంలో అనేక చర్యలు చేపట్టింది. అందులో భాగంగా సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీని ఏర్పాటు చేసింది. దీని ద్వారా సింగరేణి కార్మికులు, సింగరేణి ప్రభావిత ప్రాంతాల వారి పిల్లలు చదువుకునేందుకు వీలుగా ఆరు జిల్లాల పరిధిలో 9 పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కాలేజీ (కొత్తగూడెం), పాలిటెక్నిక్ కాలేజీ(సీసీసీ)లు ఏర్పాటు చేసింది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఈ సొసైటీని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో రెగ్యులర్, కాంట్రాక్ట్ పద్ధతిన సిబ్బంది నియామకాలు భారీగా చేపట్టింది. ఇలా 2016, 17, 18 సంవత్సరాల్లో విడతల వారీగా 300 మంది వరకు బోధన, బోధనేతర సిబ్బందిని నియమించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వీరందరికీ ఫుల్ టైం స్కేల్(ఎఫ్‌టీఎస్) వేతనం ఇవ్వడంతో పాటు ఏడాదిలో 12 నెలల కాలానికి చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇలా వేతనాలు చెల్లించే విషయంలో పాఠశాల స్థాయిలో పని చేసే వారికి ఓ రకంగా, ఆపై విద్యాసంస్థల్లో పని చేసే వారికి మరో రకంగా ఉంటోంది.

కొందరికి అలా.. మరి కొందరికి ఇలా..

కొత్తగూడెంలోని మహిళా డిగ్రీ, జూనియర్ కాలేజీ, సీసీసీ దగ్గరున్న పాలిటెక్నిక్ కాలేజీలో కాంట్రాక్ట్ పద్ధతిన పని చేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి బయట ప్రభుత్వ కాలేజీలో కాంట్రాక్ట్ సిబ్బందికి చెల్లిస్తున్నట్టుగానే ఎఫ్‌టీఎస్ ప్రకారం సగటున నెలకు రూ. 42,000 వేతనం అందుతోంది. ఇదే సమయంలో ఆరు జిల్లాల పరిధిలోని తొమ్మిది పాఠశాలల్లో పని చేస్తున్న సుమారు 130 మంది బోధన, బోధనేతర సిబ్బందికి ఎఫ్‌టీఎస్ ప్రకారం వేతనాలు అందడం లేదు. వీరికి ప్రస్తుతం నెలకు సగటు జీతం రూ. 22,750 వేతనం మాత్రమే అందుతోంది. అంతేకాదు.. ఏడాదిలో 12 నెలలకు కాకుండా 10 నెలల కాలానికే జీతం ఇస్తున్నారు.

గురుకులం తరహాలో..

ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో టీచర్లు లేరు. దీంతో సింగరేణి సంస్థ తన సొసైటీ పరిధిలో కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి ఎఫ్‌టీఎస్ ప్రకారం వేతనం చెల్లించేందుకు నిరాకరిస్తోంది. ఇదే సమయంలో ప్రభుత్వ పరిధిలో ఉన్న వివిధ గురుకుల సొసైటీల్లో కాంట్రాక్టు టీచర్లకు సగటున రూ.43,000 వరకు వేతనం అందుతోంది. దీంతో తమకు గురుకుల సొసైటీల తరహాలో ఎఫ్‌టీఎస్ ప్రకారం వేతనం చెల్లించాలంటూ సుమారు 130 మంది టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది 2018 నుంచి సంస్థను కోరుతున్నారు. సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ జనరల్ మేనేజర్ మొదలు డైరెక్టర్ పా, సీఎండీ వరకు అనేక సార్లు వినతిపత్రాలు ఇచ్చారు. నాలుగేళ్లుగా వీరు చేస్తున్న వినతులు బుట్టదాఖలు అవుతున్నాయే తప్ప సమస్య పరిష్కారం కావడం లేదు. దీనిపై సింగరేణి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

వేసవిలో కూలి పనులకు..

సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ పరిధిలోని పాఠశాలల్లో పని చేస్తున్న సిబ్బందికి ఫుల్ టైం స్కేల్ అమలు చేయకపోవడంతో ప్రతీ ఉద్యోగి నెలకు సగటున రూ.20 వేల చొప్పున నష్టపోతున్నారు. అదే విధంగా వేసవిలో రెండు నెలల పాటు జీతం లేకుండా ఇబ్బందులు పడుతున్నారు. నాలుగేళ్లుగా ఎన్నిసార్లు ఉన్నతాధికారులకు మొర పెట్టుకున్నా ఫలితం లేదు. దీంతో సొసైటీలోని పాఠశాలల్లో పని చేసే సిబ్బంది వేసవిలో ఉపాధి హామీ పనులకు కూడా వెళుతున్నారు. ఒకే సొసైటీ పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందికి చెల్లించే జీత భత్యాల విషయంలో తేడాలు చూపించడం సరికాదని పాఠశాల సిబ్బంది అంటున్నారు.

బీజేపీ, కాంగ్రెస్ అజెండా ఒక్కటే..


మాట్లాడుతున్న ప్రొఫెసర్ మురళీమనోహర్

ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో పాటు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ అజెండా ఒక్కటేనని ఓయూ ప్రొఫెసర్ మురళీమనోహర్ అన్నారు. తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ ఆధ్వర్యాన ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి సదస్సు ఖమ్మంలోని కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ భవన్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా మురళీమనోహర్ మాట్లాడుతూ బ్రాహ్మణవాదంతో ప్రతీ పార్టీ ప్రజలకు విభజిస్తోందని, తద్వారా బీసీలను ఎస్సీలు, ఎస్సీలను బీసీలు, మైనార్టీలను బీసీలు వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. ఈ కారణంగా కులగణన చేపట్టడం లేదని, ఫలితంగా దేశంలో 54 శాతం ఉన్న బీసీలకు రాజ్యాధికారం రావడం లేదని విమర్శించారు. ఈమేరకు సామాజిక న్యాయమే ఏకైక అజెండాగా సామాజిక తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ ఆవిర్భవించిందని తెలిపారు. ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు దాస్‌రాంనాయక్ మాట్లాడుతూ 1,200 మంది బలిదానం చేసినప్పటికీ ప్రజాస్వామ్యవాదులు కోరినట్లుగా కాకుండా భౌగోళిక తెలంగాణ మాత్రమే వచ్చిందన్నారు. సామాజిక తెలంగాణ సాధన కోసం మరో ఉద్యమం అవసరమని చెప్పారు. ఈ సదస్సుకు భద్రూనాయక్ అధ్యక్షత వహించగా డాక్టర్ ఎం.ఎఫ్.గోపీనాథ్, వెంకటేశ్వర్లు, శేఖర్‌గౌడ్, విజయకుమార్, రవీందర్ నాయక్, నరేందర్, కనకరాజు, జంగిపల్లి రవి, సంజీవరావు, రెహమాన్, చైతన్య, లిక్కి కృష్ణరావు, రాజు, గిరి పాల్గొన్నారు.

వచ్చే నెలలో పీవైఎల్ రాష్ట్ర మహాసభలు


మాట్లాడుతున్న గోవర్దన్

ఖమ్మంమయూరిసెంటర్: ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర రెండో మహాసభలను వచ్చే నెల 3, 4వ తేదీల్లో ఖమ్మంలో నిర్వహిస్తున్నట్లు సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.గోవర్దన్ తెలిపారు. ఖమ్మం జెడ్పీ హాల్‌లో పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.రాజేందర్ అధ్యక్షతన మంగళవారం ఏర్పాటుచేసిన మహాసభల సన్నాహక సమావేశంలో గోవర్దన్ మాట్లాడారు. కోటి ఆశలతో కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కడం లేదని తెలిపారు. నిరుద్యోగ సమస్యకు తోడు ప్రశ్నపత్రాల లీకేజీ తదితర అంశాలపై మహాసభల్లో చర్చించి పోరాట కార్యాచరణ రూపొందిస్తామన్నారు. అనంతరం సీహెచ్ బాబూరావు అధ్యక్షుడిగా ఆహ్వాన సంఘాన్ని నియమించారు. ఈ సంఘంలో ఎ.రాజేందర్, ఎం.గిరితో పాటు 100 మంది సభ్యులు ఉంటారని వివరించారు. సమావేశంలో నాయకులు బాబూరావు, వేణు, ఎం.శ్రీనివాస్, ఎం.గిరి, కె.సురేశ్, హన్మంతరావు, శోభారాణి, నిర్మల, తేజ, మోకాళ్ల రమేశ్, తుడుం వీరభద్రం, భానుచందర్, ధనసరి కుమారి పాల్గొన్నారు.

సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో డైరెక్టర్ తనిఖీ

20 మంది వైద్యులకు మెమోలు, ఫార్మసిస్ట్ బదిలీ


క్యాంటీన్‌లో అల్పాహారాన్ని పరిశీలిస్తున్న డైరెక్టర్ (పా) బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆస్పత్రిని డైరెక్టర్ (పా) ఎన్.బలరామ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వార్డుల్లో వైద్యసేవలు, క్యాంటీన్, ఫార్మసీ విభాగంలో పరిశీలించారు. సమయపాలన పాటించడం లేదని తేలడంతో ఇరవై 20 మంది వైద్యులకు అక్కడికక్కడే మెమోలు జారీ చేశారు. అలాగే, విధుల్లో లేని ఫార్మసిస్ట్‌ను బదిలీ చేశారు. ఆ తర్వాత క్యాంటీన్‌లో టిఫిన్ల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ బలరామ్ మాట్లాడుతూ భూగర్భగనిలో గాయపడిన కార్మికుడికి ఆరు నెలల పాటు సర్ఫేస్ విధులు కేటాయించాలని సీఎంఓను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినా, హాజరు నమోదయ్యాక బయటకు వెళ్లినా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్మికుల కష్టార్జితంతో వేతనాలు తీసుకుంటున్న వారు విధుల్లో అలసత్వం వహించొద్దని సూచించారు. ఆస్పత్రి సీఎంఓ బి.వెంకటేశ్వరరావు, ఏజీఎంఓలు విక్టర్ వందనం, సుజాత, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ బి.హన్మంతరావు, డీజీఎం రాజశేఖర్ పాల్గొన్నారు.

క్రీడా శిక్షణ శిబిరాల సందడి



- జిల్లాలో 38 కేంద్రాలు ప్రారంభం
- సద్వినియోగం చేసుకోండి : కలెక్టర్ గౌతమ్

క్రీడా శిక్షణా శిబిరాల వివరాలు..

క్రీడాంశం	కోచ్	సెల్ నంబర్
అథ్లెటిక్స్	ఎం.డీ.గౌస్	94900 21220
బాస్కెట్‌బాల్	ఎం.చంద్రకాంత్	73866 98298
బాస్కెట్‌బాల్	పవన్	77948 45551
బాస్కెట్‌బాల్	కార్తీక్	91338 94967
క్రికెట్	ఎం.డీ.మతిన్	93466 24241
క్రికెట్	ఎం.డీ. తురాబ్ అలీ	98495 48292
బ్యాడ్మింటన్	పవన్	83093 37038
వాలీబాల్	ఎం.డీ. అక్బర్ అలీ	98483 55350
ఫుట్‌బాల్	కె.ఆదర్శ్‌కుమార్	99896 47696
జిమ్నాస్టిక్స్	ఎం.డీ జైనా	87904 43185
స్కేటింగ్	కె.సురేష్	99123 99211
ఉషూ	పి.పర్ణిపూర్ణాచారి	98662 90609
లాన్ టెన్నిస్	కైలాస్	79799 40287
స్విమ్మింగ్	కె.కొండల్‌రావు	89856 84841
ఆర్చరీ	పి.నాగేష్	95730 16729
టేబుల్ టెన్నిస్	వీ.వీ.ఎస్.మూర్తి	98484 08335
కబడ్డీ	ఎం.నాగేశ్వరరావు	99483 17369
చెస్	సీహెచ్. గోపికృష్ణ	83091 34971
రైఫిల్ షూటింగ్	హబీబే ఫాతిమా	70936 59584
నెట్‌బాల్	ఫణికుమార్	91338 94967
హాకీ	ఎ.సాయిలక్ష్మి రిషిత	79897 31339
హ్యాండ్‌బాల్	వి.మోహన్	90009 15758

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాలో యువజన క్రీడల శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ఔత్సాహిక క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఒక ప్రకటనలో సూచించారు. రాష్ట్రప్రభుత్వం విద్యారంగంతో పాటు క్రీడలకు పెద్ద పీట వేస్తున్నందున.. వేసవి సెలవులను వృథా చేయకుండా క్రీడల్లో తర్ఫీదు పొందాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 13, ఖమ్మం నగరంలో 25 క్రీడా శిబిరాలు మొదలయ్యాయని చెప్పారు. అండర్–14 విభాగంతో పాటు ఔత్సాహిక యువకులకు కూడా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంతో పాటు పెవిలియన్ గ్రౌండ్‌లోనూ అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, ఆర్చరీ, జిమ్నాస్టిక్స్, బాస్కెట్ బాల్, ఖో–ఖో, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, ఉషూ, స్విమ్మింగ్, బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, నెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్ అంశాల్లో శిక్షణ కొనసాగుతోందని పేర్కొన్నారు. ఇక కల్లూరులో అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, క్రికెట్, వాలీబాల్, ఖో–ఖో, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, వైరాలో బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ శిక్షణ ఇస్తున్నట్లు కలెక్టర్ ఆ ప్రకటనలో వెల్లడించారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

ఏన్కూరు: డీసీసీబీ, పీఏసీఎస్‌ల ద్వారా తీసుకున్న రుణాలను రైతులు సకాలంలో చెల్లించాలని డీసీసీబీ చైర్మన్ కూరకూల నాగభూషణం కోరారు. మండల కేంద్రంలో డీసీసీబీ శాఖ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు ఇచ్చిన రుణాలు, రికవరీపై ఆరా తీశాక మాట్లాడుతూ రుణాలు సకాలంలో చెల్లిస్తే మరికొందరికి ఇవ్వడం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

భద్రాద్రి వేదికగా ఆదివాసీ సాంస్కృతిక ఉత్సవాలు

టీఏజీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మిడియం బాబూరావు


ఉత్సవాల వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ బాబూరావు

భద్రాచలంటౌన్: ఆదివాసీ సంస్కృతి ఉనికి, అస్తిత్వానికి ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యాన అపురూపమైన ఆదివాసీల సంస్కృతి, వారసత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని భద్రాచలం మాజీ ఎంపీ, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మిడియం బాబూరావు అన్నారు. టీఏజీఎస్ ఆధ్వర్యాన భద్రాచలంలో జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 3 నుంచి 6 వరకు నిర్వహించనున్న ఆదివాసీ సాంస్కృతిక ఉత్సవాల (రేలా పండూం) వివరాలను మంగళవారం ఆయన చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో వెల్లడించారు. ఆదివాసీ సాంస్కృతిక ఉత్సవాలు ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి రాత్రి 11 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. ఈ ఉత్సవాల్లో గోండు, కొలం, మన్నెవార్లు, నాయకపోడు, తోటి, ప్రధాన్, ఆందు, చెంచు తదితర తొమ్మిది ఆదివాసీ జాతుల సాంస్కృతిక కళాప్రదర్శనలు ఉంటాయని, 5వ తేదీన భద్రాచలంలో వెయ్యి మంది కళాకారుల భారీ ప్రదర్శన, బహిరంగ సభ ఉంటాయని చెప్పారు. ఈ సభకు మాజీ ఎంపీ, ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ నాయకురాలు బృందాకారత్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తదితరులు హాజరవుతారని తెలిపారు. ఇక 6వ తేదీన తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలో ఆదివాసీల అభివృద్ధిపై కార్యాచరణ రూపొందిస్తామని బాబూరావు వివరించారు. సమావేశంలో టీఏజీఎస్ నాయకులు బండారు రవికుమార్, కారం పుల్లయ్య, సున్నం గంగా, కుంజా శ్రీను, సోయం జోగారావు తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ భూమిని పరిశీలించిన అధికారులు


అనుమతి పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

సుజాతనగర్: మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామ పరిధిలోని మైనింగ్ భూమిలో అటవీ, మైనింగ్ శాఖాధికారుల ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీలు చేపట్టారు. గ్రామ పరిధిలో కె.వెంకటేశ్వరరావు ఏడేళ్లుగా రంగురాళ్ల తవ్వకాలు జరుపుతున్నాడు. సదరు భూమిలో రంగురాళ్ల నిక్షేపాలు లేవంటూ జిల్లాకు చెందిన మైనింగ్ అధికారులు ఇటీవల అనుమతులు నిలిపేశారు. దీంతో లీజుదారుడైన వెంకటేశ్వరరావు కోర్టును ఆశ్రయించాడు. ఈ మేరకు సదరు భూమిలో అధికారులు సర్వే నిర్వహించారు. భూమి హద్దులను నమోదు చేసుకోవడంతోపాటు మట్టి నమూనాలు, రంగురాళ్లను సేకరించారు. నివేదికను కోర్టుకు సమర్పిస్తామని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో వరంగల్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి, ఏడీ స్వామి, జిల్లా ఏడీ జయసింగ్, అసిస్టెంట్ జియాలజిస్ట్ నిరంజన్, ఎఫ్‌డీఓ అప్పయ్య, ఎఫ్ఆర్వో ఉమ, సర్వేయర్ శాంతకుమారి పాల్గొన్నారు.

పూరి గుడిసె దగ్ధం


కాలిపోయిన గుడిసె వద్ద రాంజీ దంపతులు

కారేపల్లి: ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పంటుకొని దగ్ధం కాగా, వృద్ధ దంపతులు నిరాశ్రయులయ్యారు. మండలంలోని గుంపెళ్లగూడెంకు గుగులోతు రాంజీ, ధ్వాలి దంపతులు పూరిగుడిసెలో నిద్రిస్తుండగా.. సోమవారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పంటుకుంది. దీంతో దంపతులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కేకలు వేస్తూ బయటకు వచ్చారు. ఈమేరకు స్థానికులు మంటలు ఆర్పేందుకు యత్నించినా ఫలితం లేకపోగా రూ.8వేలు నగదుతో పాటు బియ్యం, వంట సామాగ్రి, బట్టలు కాలిపోవటంతో వృద్ధులిద్దరూ కట్టు బట్టలతో మిగిలారు.

రోడ్డు ప్రమాదంలో అక్కాతమ్ముడికి తీవ్ర గాయాలు

- గుంతను తప్పించే క్రమంలో ఢీకొట్టిన కారు

కొణిజర్ల: రోడ్డుపై భారీ గుంతను తప్పించే క్రమంలో కారు అదుపు తప్పి ద్విచక్రవాహనం, బొలేరో వాహనాన్ని ఢీకొట్టగా అక్కాతమ్ముడికి తీవ్ర గాయాలయ్యాయి. ఇదే ఘటనలో మరో ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కొణిజర్ల మండలం పెద్ద రాంపురానికి చెందిన గవిని అఖిల ఓపెన్ ఇంటర్ పరీక్షలు రాస్తుండగా మంగళవారం పల్లిపాడు సెంటర్‌లో దింపేందుకు ఆమె తమ్ముడు గోవర్దన్ ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. లాలాపురం జమ్మికోయ బంజర మధ్య జామతోట వద్ద రోడ్డుపై ఉన్న భారీ గుంతలను తప్పించే క్రమంలో కొత్తగూడెం వైపు వెళ్తున్న ఓ కారు అదుపు తప్పి పల్టీ కొట్టగా ద్విచక్రవాహనంతో బొలేరో వాహనాన్ని ఢీకొట్టి సమీపంలో గోతిలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న అఖిల, గోవర్దన్ కాళ్లు విరిగాయి. కాగా, అఖిల ఇటీవల వివాహం కుదరగా, సోమవారం నిశ్చితార్థం అయినట్లు సమాచారం. వీరితో పాటు బొలేరో వాహనంలో వెళ్తున్న ముగ్గురు కూలీలకు స్వల్ప గాయాలు కాగా, క్షతగాత్రులను ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. కాగా, ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై జె.శంకరరావు తెలిపారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

బోనకల్: మండలంలోని ముష్టికుంట్లలో మంగళవారం ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లిన కూలీ వడదెబ్బతో మృతి చెందాడు. వివరాలు... గ్రామానికి చెందిన తటుకునూరి కోదండరామాచారి(62) ఉపాధి పనికి వెళ్లగా ఒక్కసారిగా కుప్పకూలాడు. దీంతో సహచర కూలీలు పరిశీలిస్తుండగానే మృతి చెందాడు. ఉదయం ఎండ తీవ్రతంగా ఉండడంతో వడదెబ్బ కారణంగా మృతి చెందాడని వారు ఎంపీడీఓ వేణుమాధవ్, ఏపీఓ కృష్ణకుమారి, ఎస్ఐ తేజావత్ కవిత పరిశీలించి తక్షణ సాయంగా రూ. 3వేలు అందజేశారు. కోదండరామాచారికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

చేయి కోసుకుని వ్యక్తి ఆత్మహత్య

సత్తుపల్లి టౌన్: మద్యం మత్తులో చేయి కోసుకున్న ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సత్తుపల్లిలోని వెంకటరెడ్డి వీధికి పాముర్తి శ్రీనివాసరావు(21) స్థానికంగా హోటల్‌లో పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన ఆయన ఇంట్లో ఎవరూ లేని సమయాన సోమవారం చేతి మణికట్టుపై చాకుతో కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స మంగళవారం మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రూ.1.96కోట్లకు ఐపీ దాఖలు

ఖమ్మం లీగల్: రఘునాథపాలెం మండలం మంచుకొండ గ్రామానికి కె.మంగపతి, కె.వెంకటరవి ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో మంగళవారం రూ.1,96,36,800కు దివాళా పిటీషన్(ఐపీ) దాఖలు చేశారు. వీరిద్దరు మంచుకొండలో శ్రీ తిరుమల ఫెర్టిలైజర్స్ షాపు ఏర్పాటుచేయగా, పలువురి వద్ద అప్పు తీసుకున్నారు. కానీ అవి తీర్చే పరిస్థితి లేదని చెబుతూ 89 మందిని ప్రతివాదులుగా చూపిస్తూ న్యాయవాది ద్వారా దివాళా పిటిషన్ దాఖలు చేశారు.

క్లుప్తంగా...

సీబీఐ విచారణకు హాజరైన వివేకా పీఏ కృష్ణారెడ్డి

సాక్షి, హైదరాబాద్ : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు వివేకా పీఏ కృష్ణారెడ్డిని మంగళవారం ప్రశ్నించారు. హత్యకు ముందు వివేకానందరెడ్డి రాసిన లేఖను కృష్ణారెడ్డి దాచిపెట్టిన విషయంపైనే ఎక్కువ ప్రశ్నలు అడిగినట్టు సమాచారం. మధ్యాహ్నం 3 గంటలకు కోఠిలోని సీబీఐ కార్యాలయానికి వచ్చిన కృష్ణారెడ్డిని ఐదు గంటలకు పైగా ప్రశ్నించారు. హత్య జరిగిన ప్రాంతంలో లభించిన కీలక ఆధారమైన ఆ లేఖను ఎందుకు దాయాల్సి వచ్చింది? ఎవరు ఆదేశాలిచ్చారు? లేఖను ఎవరు తొలుత గుర్తించారు? తర్వాత దాన్ని ఎక్కడ దాచిపెట్టారు? లేఖ విషయం తొలుత ఎవరెవరితో పంచుకున్నారు? లేఖను ఎన్ని గంటలకు పోలీసులకు అప్పగించారు? అప్పటి వరకు లేఖను గోప్యంగా ఉంచడానికి ప్రత్యేక కారణాలేవైనా ఉన్నాయా?.. ఇలా అనేక అంశాలపై సీబీఐ అధికారులు ప్రశ్నించారు. అధికారుల ప్రశ్నలకు కృష్ణారెడ్డి ముక్తసరిగా సమాధానాలిచ్చినట్లు తెలిసింది. ఇటీవల పులివెందులలోని కృష్ణారెడ్డి ఇంటికి సీబీఐ అధికారులు వెళ్లగా, ఆ సమయంలో ఆయన అందుబాటులో లేకపోవడంతో కుటుంబ సభ్యుల నుంచే వివరాలు సేకరించారు. ఆ తర్వాత విచారణకు హాజరుకావాలని కృష్ణారెడ్డికి నోటీసులు జారీ చేశారు. దీంతో ఆయన మంగళవారం సీబీఐ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు.

వివేకా హత్యకేసులో సాక్షి రంగన్న పరిస్థితి విషమం

వయసు రీత్యా అనారోగ్య సమస్యలు



పులివెందుల: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో సాక్షిగా ఉన్న వాచ్‌మన్ రంగన్న ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. వివేకా హత్య జరిగిన రోజు అక్కడే ఉన్న వాచ్‌మన్ రంగన్న కోర్టుకు ఇచ్చిన 164 స్టేట్‌మెంట్‌లో కూడా వివేకాను ఎర్ర గంగిరెడ్డి, ఉమా శంకర్‌రెడ్డి, సునీల్‌యాదవ్, దస్తగిరి హత్యచేశారని చెప్పిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వయసు రీత్యా పలు అనారోగ్య కారణాలవల్ల వాచ్‌మన్ రంగన్న ఆరోగ్య పరిస్థితి దెబ్బతింది. దీంతో వాచ్‌మన్ రంగన్న ఇంటివద్ద ఉన్న సెక్యూరిటీ పోలీసులు, కుటుంబసభ్యులు మంగళవారం పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతి స్విమ్స్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించడంతో రంగన్నను అంబులెన్స్‌లో తిరుపతి స్విమ్స్‌కు తీసుకెళ్లారు.

విశ్వ నగరం వెలుగు రేఖలు

విశాఖలో అత్యాధునికంగా విద్యుత్ వ్యవస్థ

- ఆర్థిక నగరం భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా భూగర్భ కేబుళ్లు
- తుపాన్లు వచ్చినా సరఫరా నిలిచిపోకుండా రూ.925 కోట్లతో నిర్మాణం



విశాఖపట్నం నుంచి సాక్షి ప్రతినిధి: ఏదైనా ఒక రాష్ట్రం, ప్రాంతం ఆర్థిక స్థితిని అంచనా వేయడంలో విద్యుత్ వినియోగం కీలక పాత్ర పోషిస్తుంది. విశ్వ నగరంగా మారిన విశాఖ ఆర్థిక రాజధానిగా బలంగా ఎదిగేలా విద్యుత్ వ్యవస్థ రూపుదిద్దుకుంటోంది. భారీ పరిశ్రమలు, ఐటీ పార్కులు, డేటా సెంటర్లు, హోటళ్లు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, మాల్స్, ఆస్పత్రులు, ఇతర వాణిజ్య కార్యకలాపాల కోసం నిరంతరం, నాణ్యమైన విద్యుత్‌ను అందించేలా విశాఖలో అత్యాధునిక సాంకేతికత అందుబాటులోకి వస్తోంది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా సరఫరాకు ఎలాంటి ఆటంకం కలగని విధంగా భూగర్భం నుంచి కేబుళ్ల ద్వారా విద్యుత్ పంపిణీ కానుంది. పారిశ్రామికవేత్తలు, పర్యాటకులను ఆకర్షించడంతోపాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విశాఖలో సిద్ధమవుతున్న ఆధునిక విద్యుత్ వ్యవస్థపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్ ఇదీ..

■ తుపాన్లకు తల వంచదు..

రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి సైతం ఎంతోమంది ఉద్యోగాలు, వ్యాపారాల కోసం వచ్చి విశాఖలో స్థిరపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహాలను అందిపుచ్చుకుంటూ పలువురు పారిశ్రామికవేత్తలు సాగర నగరిలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ వ్యవస్థను మరింత అభివృద్ధి చేసేందుకు డిస్కమ్‌లు సిద్ధమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో పనులు కూడా మొదలయ్యాయి. తుపాన్లు లాంటి విపత్తుల సమయంలోనూ విశాఖ నగరం అంతటా విద్యుత్ వెలుగులకు ఆటంకం కలుగకుండా రూ.925 కోట్లతో భూగర్భ విద్యుత్ కేబుల్ వ్యవస్థ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే రూ.481.49 కోట్ల ఖర్చుతో 80,529 విద్యుత్ కనెక్షన్లను భూగర్భ విద్యుత్ వ్యవస్థలోకి తెచ్చారు. నగరం మొత్తం 2,449 కి.మీ. పొడవున అండర్ గ్రౌండ్ కేబులింగ్ చేయనున్నారు. సముద్రాన్ని ఆనుకుని ఉన్న నగరం కావడంతో తుపాన్లు వచ్చినపుడు విద్యుత్ స్తంభాలు దెబ్బతింటున్నాయి. ఇకపై అలాంటి పరిస్థితి తలెత్తకుండా పాత స్తంభాల స్థానంలో సెంట్రిఫ్యూగల్లీ కాస్ట్ రీఇన్ఫోర్స్ కాంక్రీట్ స్తంభాలు (స్పన్‌పోల్స్) ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే 3,266 స్పన్‌పోల్స్ ఏర్పాటు కాగా అందుకోసం రూ.15.36 కోట్లను వెచ్చించారు. నష్టాల తగ్గింపు, ఆధునికీకరణ పనులను సుమారు రూ.1,722.02 కోట్లతో చేపట్టారు. ఇందులో భాగంగా 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు 16 నిర్మించనున్నారు. గత మూడు నెలల్లో 421 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు.

'భోగాపురం' భూమి పూజ నేడే

సాక్షి, అమరావతి, సాక్షి ప్రతినిధి, విజయనగరం: భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం భూమి పూజ చేయనున్నారు. దీంతోపాటు విజయనగరం జిల్లాలో మరో రెండు కీలక ప్రాజెక్టులు, విశాఖలో రూ.21,844 కోట్లతో అదానీ గ్రూప్ నిర్మించే వైజాగ్ టెక్‌పార్క్ లిమిటెడ్‌కు సీఎం శంకుస్థాపన చేస్తారు. రూ.4,592 కోట్లతో భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మాణం కానుండగా ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి బాటలు వేసేలా వైజాగ్ టెక్ పార్కు రూపుదిద్దుకోనుంది. సీఎం జగన్ భోగాపురం మండలం సవరవిల్లి వద్ద నిర్వహించే సభలో ప్రసంగించనున్నారు.

టీఎస్ ఈసెట్-2023 దరఖాస్తుల గడువు పెంపు

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్ ఈసెట్-2023 దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 8 వరకు పొడిగిస్తున్నట్లు కన్వీనర్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ మంగళవారం పేర్కొన్నారు. రూ.500 అపరాధ రుసుముతో ఈ నెల 11 వరకు, రూ.1000 అపరాధ రుసుముతో 13 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. మే 20న ఏపీలో నాలుగు చోట్ల, తెలంగాణలో 17 ప్రాంతాలలో జరిగే ప్రవేశ పరీక్షకు 21,500 మంది దరఖాస్తు చేసుకున్నారు.

ఢిల్లీ సిగలో 'గులాబీ'

- దేశ రాజధానిలో సిద్ధమైన బీఆర్‌ఎస్ కార్యాలయం
- రేపు ప్రారంభించనున్న సీఎం కేసీఆర్
- వాస్తుపూజతోపాటు సుదర్శన హోమం
- ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి వేముల, ఎంపీ సంతోష్



సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మితమైన భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) కేంద్ర కార్యాలయం ప్రారంభోత్సవానికి ముస్తాబవుతోంది. ఐదు అంతస్తుల్లో నిర్మితమైన ఈ భవనాన్ని ఈ నెల 4న తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. గురువారం ఉదయం వాస్తు పూజతోపాటు సుదర్శన హోమం నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 1:05 గంటలకు కేసీఆర్ ఈ భవనాన్ని ప్రారంభిస్తారు.

ఆంక్షలతో ఆలస్యం

ఢిల్లీలోని వసంత్ విహార్‌లో 2021 సెప్టెంబర్ 2న కేసీఆర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఏడాదిలోగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని భావించినప్పటికీ.. ఢిల్లీలో కాలుష్యం కారణంగా నిర్మాణ పనులపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. దీంతో అనుకున్న సమయానికి పూర్తి చేయలేకపోయారు. ఏడాదిన్నరగా రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ నిర్మాణ సంస్థపై ఒత్తిడి పెంచుతూ పనులు వేగంగా జరిగేలా చూశారు. బీఆర్‌ఎస్ భవన్ ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైన నేపథ్యంలో ప్రశాంత్ రెడ్డి, ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ మూడు రోజులుగా ఢిల్లీలోనే మకాం వేసి ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నారు.

ఐదంతస్తుల్లో 20 వేల చదరపు అడుగులు

మొత్తం 1,300 గజాల్లో ఉన్న స్థలంలో 20 వేల చదరపు అడుగుల ప్రాంతంలో భవనాన్ని నిర్మించారు. అందులో లోయర్ గ్రౌండ్, గ్రౌండ్, మొదటి, రెండవ, 3వ అంతస్తులతో కలిపి మొత్తం 5 అంతస్తులు న్నాయి. లోయర్ గ్రౌండ్‌లో మీడియా సమావేశాల ను నిర్వహించేందుకు వీలుగా మీడియా హాల్‌తోపాటు రెండు ఇతర గదులను నిర్మించారు. లోయర్ గ్రౌండ్‌లోకి వచ్చే మీడియాకు వీలుగా ఉండేలా ప్రత్యేక ఎంట్రెన్స్‌ను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత గ్రౌండ్ ఫ్లోర్‌లో పార్టీ ప్రధాన కార్యదర్శుల కోసం నాలుగు గదులు, కార్యాలయ రిసెప్షన్, కార్యకర్త లు, నాయకుల కోసం క్యాంటీన్‌ను సిద్ధం చేశారు. మొదటి అంతస్తులో పార్టీ అధ్యక్షుడి చాంబర్, పేషీ, కాన్ఫరెన్స్ హాల్ ఉన్నాయి. 2,3 అంతస్తుల్లో ఢిల్లీలో పార్టీకి సంబంధించిన కార్యక్రమాలకు వచ్చే కార్యకర్తలు, నాయకులు బస చేసేందు కు 18 గదులతోపాటు రెండు ప్రత్యేక సూట్ రూమ్‌లను సిద్ధం చేశారు. సూట్ రూమ్‌లలో పార్టీ అధ్యక్షుడు, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు బస చేస్తారు.

గవర్నర్‌కు ఆహ్వానమే లేదు

- అందుకే సచివాలయ ప్రారంభోత్సవానికి హాజరు కాలేదు
- రాజ్‌భవన్ నుంచి ప్రకటన విడుదల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర నూతన సచివాలయ భవన ప్రారంభోత్సవానికి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందలేదని రాజ్‌భవన్ స్పష్టం చేసింది. ఆహ్వానించినా ఆమె గైర్హాజరయ్యారనడం నిరాధారణ, తప్పుడు ఆరోపణలని తోసిపుచ్చింది. రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ప్రగతి నిరోధక శక్తులు తట్టుకోలేకపోతున్నాయని, సచివాలయ ప్రారంభోత్సవానికి గవర్నర్ రాకపోవడం అందులో భాగమేనని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి సోమవారం సూర్యాపేటలో మీడియాతో మాట్లాడుతూ విమర్శించిన విషయం తెలిసిందే. ప్రారంభోత్సవానికి రావడం, రాకపోవడం ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఆయన ఆరోపణలపై రాజ్‌భవన్ పరోక్షంగా స్పందించింది. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేసింది.

మహారాష్ట్రలో ప్రభంజనం ఖాయం: కేసీఆర్

- కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు నన్ను సంప్రదిస్తున్నారు
- అధికారంలోకి వస్తే అక్కడ తెలంగాణ మోడల్
- 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' మూలమూలకూ వెళ్లాలి
- మహారాష్ట్ర బీఆర్‌ఎస్ నేతలతో భేటీ



మహారాష్ట్ర బీఆర్‌ఎస్ నేతలతో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: ప్రజాచైతన్యమే తమ పార్టీ ఆయువుపట్టు అని, మహారాష్ట్రలో ప్రభంజనం సృష్టిస్తుందని బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. బీఆర్‌ఎస్‌కు వస్తున్న ఆదరణ చూసి మహారాష్ట్రకు చెందిన అనేకమంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు తనతో సంప్రదింపులు జరుపుతున్నారని చెప్పారు. మహారాష్ట్రలో ఏం జరగబోతోందో మీరే చూస్తారు అని వ్యాఖ్యానించారు. అధికారంలోకి వస్తే మహారాష్ట్రలో తెలంగాణ మోడల్ అమలు చేస్తామని అన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మహారాష్ట్రకు చెందిన ముఖ్య నేతలతో కేసీఆర్ భేటీ అయ్యారు. అక్కడ బీఆర్‌ఎస్ అనుసరించాల్సిన వ్యూహంపై సుదీర్ఘంగా చర్చించారు. మే 10 నుంచి జూన్ 10 వరకు మహారాష్ట్ర మూల మూలకు 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' నినాదం వెళ్లాలని స్పష్టం చేశారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

'మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్లు, బ్లాక్ స్థాయి ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు ఇప్పటికే బీఆర్‌ఎస్‌లో చేరారు. కొంతమంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు కూడా రావటానికి సిద్ధంగా ఉన్నారు. అనేకమంది నాతో సంప్రదింపులు, చర్చలు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ సిద్ధాంతాన్ని, లక్ష్యాన్ని ప్రజలకు చేరవేసి వారి ప్రేమను పొందాలి. ప్రజల మనసులు గెలవడం బీఆర్‌ఎస్ లక్ష్యం. తెలంగాణ తర్వాత మహారాష్ట్రకే దేశాన్ని మలుపుతిప్పే అవకాశం వచ్చింది. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి' అంటూ కేసీఆర్ దిశా నిర్దేశం చేశారు.

త్వరలో జిల్లా సమన్వయకర్తల నియామకం

రెండు, మూడురోజుల్లో జిల్లా సమన్వయకర్తల నియామకం పూర్తి చేస్తామని, మే 10 నుంచి జూన్ 10 వరకు పార్టీ సంస్థాగత నిర్మాణంతో పాటు పార్టీ సభ్యత్వ నమోదు పూర్తి కావాలని కేసీఆర్ ఆదేశించారు. ఒకేరోజు ఒకే సమయంలో 288 నియోజకవర్గ కేంద్రాల నుంచి పార్టీ సంస్థాగత నిర్మాణం ప్రారంభం కావాలన్నారు. శివాజీ, అంబేడ్కర్ విగ్రహాల వద్ద నుంచి పార్టీ కార్యక్రమాలు ప్రారంభం కావాలని చెప్పారు. సాధారణ సభ్యత్వానికి రూ.10, క్రియాశీల సభ్యత్వానికి రూ.50 చొప్పున తీసుకోవాలన్నారు. మే 8, 9 తేదీల్లో మహారాష్ట్ర నేతలకు హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శిక్షణ శిబిరాలు ఉంటాయని తెలిపారు. ఈ భేటీలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ బీబీ పాటిల్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, పీయూసీ చైర్మన్ జీవన్‌రెడ్డి, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎమ్మెల్యే జోగురామన్న, మాజీ ఎంపీ నగేశ్, దాసోజు శ్రవణ్, మహారాష్ట్ర ముఖ్యనేతలు మాణిక్ కదం, మాజీ ఎమ్మెల్యే శంకరన్న డోంగే, మాజీ మేయర్ రవీంద్రసింగ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వార్తలు


జేపీఎస్‌ల సమ్మెపై సీఎం స్పందించాలి



సమ్మె శిబిరంలో పాల్గొన్న వీరభద్రం

ఖమ్మంరూరల్: క్రమబద్ధీకరణతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మెపై సీఎం కేసీఆర్ స్పందించి వారికి న్యాయం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కోరారు. ఖమ్మంరూరల్ మండలం జలగంనగర్‌లో జేపీఎస్‌లు చేపట్టిన సమ్మె మంగళవారం ఐదో రోజుకు చేరగా తమ్మినేని వారికి సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులతో తక్కువ వేతనానికి వెట్టిచాకిరీ చేయించుకుంటుండగా, క్రమబద్ధీకరణపై దృష్టి సారించడం లేదన్నారు. అనంతరం ఖమ్మం రూరల్ మండలం వరంగల్ క్రాస్‌రోడ్డులోని తమ్మినేని సుబ్బయ్య భవన్‌లో జరిగిన తెలంగాణ గిరిజన సంఘం సమావేశంలో తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ గిరిజన అభివృద్ధి, సంక్షేమం కోసం ఖమ్మం కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు బండి రమేశ్, మోహన్‌రావు, నంద్ర ప్రసాద్, బషీరుద్దీన్, వీరన్న, సిద్దినేని కోటయ్య, కర్లపూడి సుభద్ర, శ్రీనివాస్, వీరభద్రం, బోస్‌నాయక్, నాగేశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.

జేవీఆర్ ఓసీని సందర్శించిన డైరెక్టర్



అధికారులకు సూచనలు చేస్తున్న డైరెక్టర్ సత్యనారాయణ

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి జేవీఆర్ ఓసీలోని ఈపీసీ, సీహెచ్‌పీలను మంగళవారం సింగరేణి డైరెక్టర్ డి.సత్యనారాయణ మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా కొత్తగూడెం ఏరియా జీఎం సుధాకర్‌రావుతో కలిసి ఆయన పరిశీలించాక మాట్లాడుతూ బెల్ట్‌లు, యూనిట్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎక్కడా దుమ్ము పేరుకుపోకుండా చూడాలని సూచించారు. తద్వారా ఈపీసీ, సీహెచ్‌పీ నిర్వహణకు ఆటంకం ఏర్పడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎం స్వామినాయుడు, అధికారులు సూర్యనారాయణ, రఘురామిరెడ్డి, కృష్ణయ్య, రమణారెడ్డి పాల్గొన్నారు.

'పట్టు'కుంటే లాభాలే..!

- మల్బరీ సాగు, పరిశ్రమల ఏర్పాటుకు రాయితీలు
- తక్కువ పెట్టుబడితో ఏటా ఆరు నుంచి ఏడు పంటలు
- ప్రతీ పంటకు రూ.1.20 లక్షలపైనే ఆదాయం
- ఉమ్మడి జిల్లాలో రైతుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం



మల్బరీ తోట

ఖమ్మంవ్యవసాయం: పట్టు పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్ని ఇచ్చే పట్టు పరిశ్రమల స్థాపనకు రైతులు ముందుకొచ్చేలా రాయితీలు ప్రకటించింది. మల్బరీ సాగు, పరిశ్రమల ఏర్పాటు, నిర్వహణకు ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వం సిల్క్ సమగ్ర పథకం ద్వారా ఈ రాయితీలను ఇవ్వనుంది. అలాగే, నర్సరీల పెంపకా నికి కూడా రాయితీలు ప్రకటించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పట్టు పరిశ్రమ నిర్వహణ, మల్బరీ సాగుకు వనరులు, అనుకూలతలు ఉండటంతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం, ఖమ్మం రూరల్, ఖమ్మం అర్బన్, వైరా, తిరుమలాయపాలెం తదితర మండలాల్లో 57, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో బూర్గంపాడు, పాల్వంచ, అశ్వాపురం తదితర మండలాల్లో 160 పట్టు పరిశ్రమలను రైతులు నిర్వహిస్తున్నారు.

సిల్క్ సమగ్ర పథకం రాయితీలు (రూ.ల్లో)

పంట సాగు, పరిశ్రమ	సాధారణ	ఎస్సీ సబ్‌ప్లాన్	ఎస్టీ సబ్‌ప్లాన్
రెండెకరాల్లో మల్బరీ సాగు	60,000	78,000	78,000
డ్రిప్	50,000	65,000	65,000
రేలింగ్ షెడ్ నిర్మాణం	2,25,000	2,92,500	2,92,500
రేలింగ్ స్టాండ్ల నిర్మాణం	15,456	26,706	26,706
పట్టు పురుగుల పరికరాలు	37,500	37,500	37,500
రోగనిరోధక మందులు	2,500	3,250	3,250
కిసాన్ నర్సరీ	75,000	97,500	97,500
(యూనిట్ రూ.1.50 లక్షలు)			

ఏటా రూ.7 లక్షలకు పైగా ఆదాయం

పట్టు పరిశ్రమ నిర్వహణతో ఏటా ఆరు నుంచి ఏడు పంటలు తీసే అవకాశం ఉంది. ప్రతి 35 రోజులకు పట్టు గూళ్లను ఉత్పత్తి చేయవచ్చు. ఒక్కో పంట ద్వారా రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షల వరకు ఆదాయం వస్తుంది. అంటే ఏడాదిలో ఏడు పంటలు పండిస్తే (పట్టుగూళ్లు తీస్తే) సగటున రూ.7 లక్షల వరకు ఆదాయం సమకూరుతుంది. వాణిజ్య పంటల కంటే మిన్నగా మల్బరీ సాగు, పట్టు గూళ్ల పెంపకం నుంచి ఆదాయం గడించే అవకాశం ఉండగా.. తెగుళ్ల బెడద లేకపోవడంతో క్రిమిసంహారక మందుల అవసరం లేదు. నల్ల రేగడి, చౌడు భూములు మినహా అన్ని రకాల నేలల్లో మల్బరీ పంటను పండించొచ్చు. నీటి వినియోగం కూడా తక్కువగానే ఉంటుంది. మల్బరీ సాగు చేసిన మొదటి ఏడాది మాత్రం మూడు పంటలను తీసే అవకాశం ఉంది. మల్బరీ మొక్కలను ఒక్కసారి నాటితే 10 నుంచి 15 ఏళ్ల పాటు పట్టు గూళ్ల పెంపకానికి వినియోగించుకోవచ్చు.


పట్టు గూళ్లకు పెరుగుతున్న డిమాండ్

పట్టు గూళ్లకు కొంతకాలంగా డిమాండ్ పెరుగుతోంది. నాణ్యత ఆధారంగా పట్టుగూళ్లకు ధర నిర్ణయించి రీలింగ్ యూనిట్ల నిర్వాహకులు కొనుగోలు చేస్తారు. రెండేళ్ల కిందట కిలో పట్టు గూళ్ల ధర రూ.400 వరకు ఉండగా, ఈ ఏడాది రూ.600 పలుకుతోంది. పట్టుగూళ్లకు డిమాండ్ ఉన్నా రీలింగ్ యూనిట్ల నిర్వాహకులకు ఆశించిన స్థాయిలో గూళ్ల లభ్యత లేకపోవటంతో ధరకు రెక్కలొస్తున్నాయి. నాణ్యత ఆధారంగా పట్టు గూళ్లకు ధర మరింత పెరిగే అవకాశముందని పరిశ్రమ నిర్వాహకులు చెబుతున్నారు.

అందుబాటులోకి పట్టుగూళ్ల మార్కెట్లు

పట్టుగూళ్ల కొనుగోలు చేసే మార్కెట్లను రాష్ట్రంలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇప్పటికే జనగామలో నెలకొల్పిన ఆటోమెటిక్ రీలింగ్ యూనిట్ పట్టుగూళ్ల కొనుగోలు కేంద్రం దేశంలోనే ఖ్యాతి గడించింది. ఆ యూనిట్ నిర్వహణ, నాణ్యతలో దేశంలో రెండో దిగా గుర్తింపు సాధించింది. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా, ఉమ్మడి నల్లగొండ జిల్లాలకు ప్రయోజనం కలిగేలా సూర్యాపేటలో ఆటోమెటిక్ రీలింగ్ యూని ట్‌ను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దీనికి తోడు వికారాబాద్, సిద్దిపేటల్లో కూడా ఆటోమెటిక్ రీలింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

పంట, పరిశ్రమతో అధిక ఆదాయం



సంప్రదాయ పంటల కంటే మిన్నగా మల్బరీ సాగు, పట్టు పరిశ్రమ నిర్వహణతో ఆదాయం వస్తుంది. పట్టు గూళ్లకు డిమాండ్ పెరుగుతోంది. పరిశ్రమ నిర్వహణ, పంట సాగులో ఖర్చు తక్కువగా, ఆదాయం ఎక్కువగా ఉంటుంది. ఏటా ఏడు పంటలను ఇచ్చే పట్టు పరిశ్రమ పంటను ఉమ్మడి జిల్లాలో అభివృద్ధి చేసేందుకు కృషి జరుగుతోంది. రైతులు పట్టు పరిశ్రమ, ఉద్యాన అధికారులు, కార్యాలయాల్లో సంప్రదించవచ్చు.

–జి.అనసూయ, ఉమ్మడి ఖమ్మం జిల్లా పట్టు పరిశ్రమ సమన్వయ అధికారి

ఉమ్మడి జిల్లాలో 380 ఎకరాల లక్ష్యం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 380 ఎకరాల్లో మల్బరీ సాగు, పరిశ్రమల స్థాపన లక్ష్యంగా పట్టు పరిశ్రమ శాఖ ప్రణాళిక రూపొందించింది. ఖమ్మం జిల్లాలో 150 ఎకరాల్లో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 230 ఎకరాల్లో మల్బరీ సాగుకు రైతులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నారు. సాధారణ రైతులతో పాటు, ఎస్సీ, ఎస్టీ రైతులకు పట్టు పరిశ్రమల స్థాపనలో ప్రాధాన్యం ఇస్తున్నారు. సాధారణ రైతుల కన్నా వీరికి రాయితీలు మరింత ఎక్కువగా లభిస్తాయి.

ఐటీఐ శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఏపీఓ డేవిడ్‌రాజ్

భద్రాచలం: ఐటీడీఏ ఆధ్వర్యాన ఇస్తున్న జేఈఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని గిరిజన విద్యార్థులు ఎక్కువ మంది ఐఐటీ సీట్లు సాధించాలని ఐటీడీఏ ఏపీఓ(జనరల్), గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలంలోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో జేఈఈ అడ్వాన్స్‌డ్ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గిరిజన విద్యార్థుల అభ్యున్నతికి ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు సూచనల తో శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. నిరుపేద గిరిజన విద్యార్థులు శిక్షణను సద్వినియోగం చేసుకుని ప్రఖ్యాత యూనివర్సిటీలు, కళాశాలల్లో సీట్లు సాధించాలని ఆకాంక్షించారు. కాగా, ఎంపిక చేసిన విద్యార్థినులకు భద్రాచలంతో పాటు దమ్ముపేట, కిన్నెరసానిల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జేఈఈ మెయిన్స్‌లో ఎక్కువ మంది అర్హత సాధించేలా శిక్షణ ఇచ్చిన అధ్యాపకులను ఏపీఓ అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ దేవదాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

- కొత్త కోర్సులకు ముందుకొస్తే అనుమతి
- కేయూ వీసీ ఆచార్య రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ రమేష్

కేయూ క్యాంపస్: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, నైపుణ్యాల అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యం కావాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ తెలిపారు. వరంగల్‌లోని కేయూ పరిపాలన భవనం సెనేట్‌హాల్‌లో మంగళవారం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్ల సమావేశం ఏర్పాటుచేయగా వీసీ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. వచ్చే విద్యాసంవత్సరం(2023–2024)లో ఉపాధి కల్పనకు కొత్త కోర్సులు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చే కళాశాలలకు అనుమతి ఇస్తామన్నారు. అయితే ఆయా కళాశాలల్లో అన్ని మౌలిక వసతులు ఉండాలని తెలిపారు. ప్రతీ ఉమ్మడి జిల్లాకు పది చొప్పున 30 కళాశాలలకు అవకాశం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా తరగతిగదులు, ల్యాబ్ సదుపాయాలు మెరుగుపర్చుకోవాలని, ప్రభుత్వ, ప్రైవేట్ తేడా లేకుండా అన్ని కళాశాలలు న్యాక్ గుర్తింపునకు సిద్ధం కావాలని సూచించారు. ఎంపిక చేసిన ప్రభుత్వ కళాశాలలను రీసెర్చ్ సెంటర్లుగా గుర్తించి పలువురు అధ్యాపకులకు పీహెచ్‌డీ గైడ్‌షిప్ ఇచ్చామన్నారు. కాగా, డిగ్రీ ఫలితాలను త్వరలో విడుదల చేయనున్నట్లు వీసీ వెల్లడించారు. పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, కేయూ సీడీసీ డీన్ ఆచార్య వి.రాంచంద్రం మాట్లాడగా రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాసరావు, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు ఆచార్య ముస్తఫా, డాక్టర్ జె.మధుకర్, ఎస్.జ్యోతి, సీహెచ్.రాధిక, ఎ.నరేందర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు డాక్టర్ కోలా శంకర్, రామా వెంకటేశ్వర్లు, హబీబ్, ఆర్.శ్రీలతాదేవి, డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

టీటీడీ ఆధ్వర్యాన శ్రీనివాస కల్యాణం

రేపు నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో నిర్వహణ



కల్యాణోత్సవ వివరాలు వెల్లడిస్తున్న ప్రతినిధులు

బూర్గంపాడు: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యాన ఈనెల 4న బూర్గంపాడు మండలం నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలోని గొమ్మూరు వ్యవసాయ క్షేత్రంలో శ్రీనివాస కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు కల్యాణ వేదిక వద్ద మంగళవారం వారు వివరాలు వెల్లడించారు. తిరుమల నుంచి స్వామివారి ఉత్సవ విగ్రహాలతో అర్చకులు, వేదపండితులు చేరుకుని కల్యాణోత్సవం నిర్వహిస్తారని తెలిపారు. తిరుమల నుంచి స్వామివారి రథం కల్యాణోత్సవ ప్రాంగణానికి బుధవారం సాయంత్రం చేరుకోనుండగా భక్తులు స్వాగతం పలకాలని కోరారు. భక్తులకు ఐటీసీ పీఎస్‌పీడీ ఆధ్వర్యాన అన్నప్రసాదాలు సమకూరుస్తున్నట్లు తెలిపారు. కల్యాణోత్సవ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మల్లేశ్వరరావు, సర్పంచ్ భుక్యా శ్రావణి, ఐటీసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు పాకాల దుర్గాప్రసాద్‌తో పాటు యడమకంటి ఝాన్సీలక్ష్మి, బిజ్జం శ్రీనివాసరెడ్డి, వై.పిచ్చిరెడ్డి, గోనె దారుగా, కె.పెద్దిరెడ్డి, సోము సుబ్బారెడ్డి, యారం వెంకట్రామిరెడ్డి, కోట నాగిరెడ్డి, దారం కృష్ణారెడ్డి, బి.వెంకటేశ్వరరెడ్డి, రామకృష్ణ, బానోత్ రామదాసు, ప్రభాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, పోతిరెడ్డి వెంకటరెడ్డి, భుక్యా శివకృష్ణ పాల్గొన్నారు.